Andhra Jyothy Dt. 13/01/19.

# మెట్రో మరో రికార్డు

## ఒకే రోజు 2.26లక్షల మంది ప్రయాణం - మెట్రోలోనూ సంక్రాంతి రద్దీ

హైదరాబాద్ సిటీ, జనవరి 12 (ఆంధ్ర జ్యోతి): ప్రయాణికుల ఆదరణతో మెట్రో తన రికార్డులను తానే అధిగమిస్తోంది. గత ఏడాది డిసెంబర్ 31న 2.10లక్షల మంది ప్రయాణం చేయగా, సంక్రాంతి సెలవుల నేపథ్యంలో మెట్రోలోనూ ప్రయాణికులు అధిక సంఖ్యలో ప్రయాణించారు. నగరం నుంచి సంక్రాంతి పండగకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి వెళ్లే వారిలో చాలా మంది మెట్రోలో ఎల్‌బీనగర్ వరకు ప్రయాణించారు. అక్కడి నుంచి తమ గమ్య స్థానాలకు వెళ్లారని మెట్రో ఎం.డి ఎన్వీఎస్ రెడ్డి తెలిపారు. ఆర్టీసీ బస్సులు, ప్రైవేటు ట్రావెల్ బస్సులను ఎక్కువగా ఎల్‌బీనగర్, నాగోల్, ఉప్పల్ ప్రాంతాలను నడపడంతో అక్కడి వరకు ప్రయాణికులు మెట్రోలోనే ప్రయాణించారు. దీంతో 11వతేదీన రికార్డు స్థాయిలో 2.26 లక్షల మంది పెయిడ్ ప్యాసింజర్స్ ప్రయాణం చేయగా, మెట్రో ఉద్యోగులతో కలిపితే మొత్తం 2.41లక్షల మంది మెట్రోలో ఒక్క రోజే రాకపోకలు సాగించారు. 46 కి.మీ దూరం ఉన్న రెండు కారిడార్‌లోనే రికార్డు స్థాయిలో ప్రయాణం చేశారన్నారు. సికింద్రాబాద్ ఈస్ట్ మెట్రో స్టేషన్ నుంచి ఒకేసారి ఎక్కిన వారు 6,656 మంది ఉండగా, 14,291 మంది దిగి, దూర ప్రాంతాలకు వెళ్లేందుకు రైల్వేస్టేషన్‌కు వచ్చారు. మొత్తం ప్రయాణికుల్లో మెట్రో స్మార్ట్ కార్డుతో ప్రయాణించిన వారు 87,620 మంది ఉండగా, కౌంటర్‌లో టోకెన్ తీసుకొని ప్రయాణం చేసిన వారు 1,38, 390 మంది ఉన్నారు. స్మార్ట్ కార్డుతో ప్రయాణిస్తున్న వారి సంఖ్య గణనీయంగా పెరుగుతోందని మెట్రో అధికారులు తెలిపారు. రోడ్లపై ట్రాఫిక్ సమస్యల నేపథ్యంలో ఖచ్చితమైన సమయానికి చేరుకునేందుకు మెట్రోలోనే ప్రయాణం చేస్తుండడంతో, రోజు రోజుకు ప్రయాణం చేసేవారి సంఖ్య పెరుగుతోందని అధికారులు తెలిపారు.

### మెట్రో స్టేషన్‌ల వారీగా ప్రయాణికులు..

| మెట్రో స్టేషన్ | ఎక్కిన వారు | దిగిన వారు |
|---|---|---|
| మియాపూర్ | 16,298 | 12,534 |
| జేఎన్‌టీయూ | 11,407 | 5,620 |
| కేపీహెచ్‌బీ | 16,122 | 11,053 |
| అమీర్‌పేట | 21,549 | 17,222 |
| ఎల్‌బీనగర్ | 15,006 | 10,675 |
| ఉప్పల్ | 8,253 | 8,363 |
| సికింద్రాబాద్ | 6,656 | 14,291 |